# సింహాచలం సంపెంగ

శ్రీరమణ




ఈ పాతిక ముప్ఫై ఏళ్లలో మావయ్య ముఖతా ముక్కలు ముక్కలుగా ఎన్నోసార్లు విని వుంటాం. భక్తి, రక్తి వుండడం వల్లనో, మావయ్య చెప్పే తీరువల్లనో ఎన్నిసార్లు విన్నా మళ్లీ వినాలనిపించేది. మొన్నామధ్య మావయ్య అత్తయ్యా ఒక పెళ్లికి వచ్చారు. డెబ్భైయ్యవ పడిలో పడ్డాడన్నమాటే గాని, అలనాటి మాట కారితనంలో గాని, ఆంగికంలో గాని పెద్ద తేడా రాలేదు. జ్ఞాపక శక్తి యింకాస్త పెరిగిందేమోనని అనుమానం.

ఆయన అయస్కాంతంలా మనుషుల్ని లాగేస్తాడు. రైల్లో వెళ్తున్నా సరే, ఆయనకు ఎప్పుడూ కూచోడానికి సీటు సమస్య వచ్చేది కాదు. రైలు ఎంత వత్తిడిగా వున్నా, ఎవరో వొకరితో మాట కలిపి రాజకీయాల మీదో సినిమాల మీదో నాలుగు చెణుకులు విసిరేవాడు. శ్రోతలంతా కాసేపటికి శిష్యులైపోయేవారు. గురువు గారిని నిలబెడితే ఏమి బావుంటుందని సద్దుకుని సీటిచ్చేవారు.

పెళ్లిళ్లకొచ్చినా అంతే. మేళాలు మంత్రాలు ఆపేస్తే బావుండనిపించేది చుట్టూ చేరినవాళ్లకి. అత్తయ్యకి లోలోపల మావయ్య చమత్కారం మీద ఆరాధనా భావం వున్నా, పైకి తేలేది కాదు. మరీ పెచ్చురేగి పోతాడని భయం వుండేది. ఈసారి మేమంతా ఒక నిర్ణయానికి వచ్చాం. మావయ్య తరచు చెప్పే తన నిజజీవిత సంఘటనను ఒక టేపులో రికార్డు చెయ్యాలని. దానికి తగిన ఏర్పాట్లన్నీ చేశాం. మేము ఏడెనిమిది మంది వరసైన వాళ్లం మావయ్యని మేఘసందేశం కథ చెప్పడానికి వొప్పించాం. మొదట తలవూపాడు కాని తర్వాత "వుత్సాహం వురకలు వేసే రోజుల్లో మీ అత్తయ్య ఔనన్నా కాదన్నా నా పని నేను చేసుకు వెళ్లేవాణ్ణి. ఇప్పుడు ఆవిడని అడక్కుండా ఆఖరికి స్వీటు తినడానికి కూడా లేదు. అంచేత ఆవిడ చేత సరేననిపించుకురండి." అంటూ ఆంక్ష విధించాడు. అత్తయ్యకి యీ విషయం సవినయంగా మనవి చేశాం. ఆవిడ ఏ కళన వున్నదో "సరే అఘోరించండి" అన్నది. ఈ ముక్క మాకే వర్తిస్తుంది గాని మావయ్యకి కాదు.

ఎందుకైనా మంచిదని రెండు వుత్తమ జాతి టేపు రికార్డర్లు, రెండు అశ్వనీజాతి మైకుల్ని అమర్చాం. మావయ్య గాత్రసౌలభ్యం దెబ్బతినకుండా రకరకాల పానీయాలు అమర్చాం. గది చాలావరకు బయట శబ్దాలను చొరనీయకుండా, బందోబస్తుగానే వుంది. అక్కడ చేరినవాళ్లంతా ఎవరికి వాడు ఒక సినిమా డైరెక్టర్ స్థాయిలో మావయ్యకి సూచనలు సలహాలు యిస్తున్నారు. ఈ వాతావరణం చూసి మావయ్య కొంచెం బిగుసుకుపోయి, ఆ పైన గ్రాంధికంలో మాట్లాడడం మొదలుపెట్టాడు.

కాసేపటికి చచ్చీ చెడీ దారికి తెచ్చాం. నిశ్శబ్దం... టేపులు తిరుగుతున్నాయ్....మావయ్య తన సహజ ధోరణిలో మొదలుపెట్టాడు-.

యాభై ఏళ్లనాటిమాట...నేను ఒట్టు పెట్టుకున్నాను. జీవితంలో ప్లీడర్ గారి అమ్మాయిని పెళ్లి చేసుకోకూడదని. కాని ఏం చేస్తానూ అప్పటికే పడాల్సిన తప్పటడుగులు పడనే పడ్డాయి. అనుకుంటాం గాని అనుభవం వచ్చే సరికి అంతా చెయ్యిదాటిపోతుంది. అప్పుడు నాకు పద్దెనిమిది, మీ అత్తయ్యకి పదహారు. నాకు వుద్యోగం కూడా లేదు. ప్లీడర్‌గారికి యమ ప్రాక్టీసు వుండేది. ఆ సంవత్సరం ఆయన తల్లిగారు కాలం చేస్తే అన్ని దానాలతో పాటు కన్యాదానం కూడా చేస్తే మంచిదన్నారట. దాంతో కట్నం ఒక వంద యిటైనా అటైనా ఫర్వాలేదని వుదారంగా మాటలు నడిపారు. ఆ టైములో వుయ్యార్ బ్యాడ్లీ యిన్ నీడ్ ఆఫ్ మనీ. ఇక ఆలోచించడానికి మాకూ టైము లేదు. వాళ్లకూ టైము లేదు. మనలో మన మాట, యిప్పుడంటే మీ అత్తయ్య అరవైల్లోకి వచ్చి కాస్త పెద్ద తీరున కనిపిస్తోంది గాని, అప్పట్లో తీర్థంలో చెరుకుగడలా వుండేది.


రోజులు కులాసాగా వెళ్తున్నాయిలే అనుకుంటుండగా ఆషాఢం వచ్చిందన్నారు. కాస్త ముందుగా చెప్పచ్చు కదా తీరా ఒక్కరోజు ముందు చెప్పారు. ఏం చేస్తాను బతుకు జీవుడా అని అత్తగారింటిని, నమిలే నమిలే చెరుగ్గడని వదిలి మా వూరు చేరాను. మనసు మనసులో వుంటే ఒట్టు. ఆషాఢం నెల్రోజులు అత్తారింటి గడప తొక్కకూడదన్నారు.

ప్లీడర్‌గారి అమ్మాయిని చేసుకోకూడదని జాతికి సందేశం యివ్వాలని ఎందుకు అనిపించిందంటే, దానికి పది కారణాలు పైన వున్నాయి. ఆషాఢంలో కూరుకుపోయి విచారిస్తూ మీ అత్తయ్యకి నా మనోభావాల్ని పోస్టు కార్డు మీద వివరంగా రాశా. ప్లీడర్ గారి దగ్గర, అంటే మీ అత్తయ్య వాళ్ల ఫాదర్ కొలువులో యిద్దరు గుమాస్తాలుండేవారు. పెద్దాయన సీతారామయ్యని భలే అసాధ్యుడు. అవతల పార్టీ వాళ్లకి వీళ్లిచ్చిన నోటీసు చదివించుకోవాలంటే, మళ్లీ ఆయన దగ్గరకే వచ్చి తృణమో పణమో యిచ్చి విషయం తెలుసుకు వెళ్లాల్సిందే. బ్రహ్మరాత! మరీ పూనకం వస్తే ఆయన రాత ఆయనే చదవలేకపోయేవాడే. నేను రాసిన ప్రతికార్డూ రెండు రూపాయలిస్తే గాని మీ అత్తయ్యకి చదివి వినిపించేవాడు కాదుట. మరోసారి వినిపించుకోవాలంటే ఒక రూపాయి మళ్లీ సమర్పించాల్సిందే. అయితే ఆయనలో ఓ గొప్ప సుగుణం వుంది. చచ్చినా సంగతులు బయటకు చెప్పడు. అసలాయన చదువుతాడు గాని వినడు. అసలు పెళ్లిచూపులప్పుడు అమ్మాయి పెద్దగా చదువుకోలేదంటే, చిన్నగా చదువుకుందేమోనని సరిపెట్టుకున్నా. తీరా చూద్దును కదా బొత్తిగా బొమ్మల చదువు. అంటే ఆవు, ఈల, ఈగ యిలా బొమ్మలు చూపిస్తే చదివినట్టే చెప్పేది.

నేను మా పుట్టింట్లో మరీ పరధ్యాన్నంగా వుంటుంటే మా నాయనమ్మ రకరకాలుగా వోదార్చేది. హనుమాన్ చాలీసా చదువుకుంటే కొంత వూరటగా వుంటుందని చెప్పేది. అలాగ ప్రథమ ఆషాఢంలో చాలీసా నాకు నోటికి వచ్చేసింది. దేవుడు నాయందుండి ఆషాఢం వెళ్లి శ్రావణం వచ్చింది." ఇట్లాంటప్పుడు అంతగా మంచీ చెడూ చూడక్కర్లేదు. నువ్వు బయలుదేరచ్చు." అన్నది నాయనమ్మ. చివరి ముక్క వచ్చే సరికి నేను స్టేషన్‌కు వెళ్లే దారి మార్గంలో వున్నా. అప్పట్లో అంటే యాభై ఏళ్లనాడు యివన్నీ ఎక్కడివి? పొద్దున్నే పెరుగుబండి, తర్వాత దొంగల బండి, అర్థరాత్రి దయ్యాల బండి. పెరుగు బండిలో బయలుదేరిన వాణ్ణి దయ్యాలబండి వేళకు అక్కడ దిగాను. ఎదురుగా అద్దం లేకపోయినా నా వాలకం నాకు తెలుస్తూనే వుంది. బొగ్గు యింజన్ రైల్లో నలభై మైళ్లు ఆరుగంటలు ప్రయాణం చేసి వచ్చినట్టు ఎవరైనా గుర్తించగలరు. టౌను హాలు పక్కన చిత్ర కళామందిరంలో చరణదాసి సినిమా ఆడుతోంది. దాని ముందు రెండు రిక్షాలు ఆగివున్నాయి. "ఫలానా ప్లీడర్‌గారింటికి..." అని అడిగాను.

"ఆఖరి రీలు నడుస్తోంది. రైలుపేట బేరాలున్నాయ్ బాబూ" అన్నారు వాళ్లు. సరేపోను అనుకుని హనుమాన్‌చాలీసా వల్లిస్తూ మనసు మీ అత్తయ్య మీద నిలిపి నడక సాగించాను. వాకిట్లో అడుగు పెడుతుంటే ఠాంగ్ మని గోడగడియారం కొట్టిన ఒంటిగంట వినిపించింది- శుభం పలికినట్టు. సింహద్వారం తట్టాను. ఒకటో సారి, రెండోసారి, మూడోసారి- అంతే భళ్లున పక్కనేవున్న కిటికీలోంచి చిరిచాప చుట్ట దూసుకు వచ్చింది. ఇంటి అల్లుడుకీ, కోర్టుపక్షికీ తేడా తెలుసుకోలేకపోవడం నా మనసుని తొలిచేసింది.

"నేనండీ...నేను" అంటూ మళ్లీ తలుపు తట్టాను. "వరండాలో పడుకోండి. వకీలు గారు పొద్దుటే మాట్లాడతానన్నారు." అని జవాబు, కిటికీ రెక్కలు మూసుకున్న చప్పుడు కలిసి వినిపించాయి. నా మనసు పూర్తిగా విరిగిపోయింది. ఒకవైపు చాపచుట్ట నన్ను వెక్కిరిస్తోంది. మరోవైపు రైల్లో కొన్న సింహాచలం సంపెంగల వాసన సంచీలోంచి బయటకు వచ్చి మరీ ఎగతాళి చేస్తోంది. నాకు తెలుసు ప్లీడర్ గారి యింట్లో యిట్లాగే వుంటుంది. అందుకే మరి నేను ఒట్టు పెట్టుకున్నది. చేసేది లేక గుమ్మం వార గోడకి జారబడ్డాను. సంపెంగ వాసన నా మనశ్శాంతిని మరింత చెదరగొడుతోంది. సంచీలోంచి



పూలపొట్లం తీశాను. రోడ్డుమీదకు విసిరేయాలనుకున్నాను. వద్దని వారించినట్లు లోపల్నించి గోడ గడియారం ఠాంగ్ ఠాంగ్‌న రెండు హెచ్చరికలు చేసింది. పైగా శ్రావణంలో భార్య కోసం కొన్న తొలిపూల పొట్లం. దాన్ని విసిరేయాలంటే చెయ్యి రాలేదు. విదియ నాటి వెన్నెల వెలుగులో వరండా గోడమీద ఆంజనేయస్వామి నా వంక ప్రసన్నంగా చూస్తున్నట్లు అనిపించింది. అరటి నారలో కట్టిన సింహాచలం సంపెంగ దండను ప్రసన్నాంజనేయుడి పటానికి వేసి, బరువుగా నిట్టూర్చాను. కూచునే ఒక కునుకు తీశాను. ఆ కునుకులో ఎన్నో తీపి జ్ఞాపకాలు కలలా మెదిలాయి.

తెలతెలవారుతుండగా జయమ్మ గారు "ఎవరూ" అంటూ చూపుసారించింది. గుర్తుపట్టింది నా బొగ్గు వాలకాన్ని. "ఇదేనా నాయనా రావడం" అని పలకరించింది. "బండి లేటు. అర్ధరాత్రి వచ్చాను." అన్నాను క్లుప్తసరిగా. ఆవిడ నన్ను, పక్కన పడివున్న చాపచుట్టని చూసి సంగతంతా గ్రహించింది.

"అయ్యో, ఎవరో వాయిదాల వాళ్లనుకొని వుంటారు. నేనిక్కడ మెట్లకిందనే పడున్నా. నన్ను పిలిస్తే పోను నా దగ్గరైనా పడుకునేవాడివి పాపం...." అంటూ గోరుచుట్టుమీద రోకలిపోటు వేసింది. జయమ్మగారి గురించి నాలుగుముక్కలు చెప్పాలి. జయమ్మగారిని మనోవర్తి వ్యాజ్యంలో గెలిపించారు, మా మామగారు. ఆవిడకు రెండు ఎకరాలు, ఆరు సంవత్సరాల గత ఫలసాయాలు దక్కాయి.

"అరవై ఏళ్లు పైబడ్డాయి. ఏదో మీ పంచన పడి వుంటాను. ఆ రెండు ఎకరాలూ మీకే, ఓపిక వున్నన్నాళ్లూ చాకిరీ చేసిపెడతాను. మీతోపాటు ఒక ముద్ద అన్నం పెట్టండి, చాలు" అన్నది జయమ్మగారు. ఈ ఆలోచన వుభయతారకంగా వుందనిపించింది మామగారికి. ఎందుకంటే మా అత్తగారు నిత్యం నీరసంగా ఆపసోపాలు పడుతుండేది. కుటుంబాన్ని పెంచి పోషించడంలో మాత్రం బద్ధకించేవారు కాదు. వృత్తిపట్ల ఎంత దీక్ష వుండేదో మా మామగారికి యిలాంటి లౌకిక వ్యవహారాల మీద కూడా అంత దీక్ష వుండేది. మొదట యిద్దరు మగపిల్లలు, తర్వాత వరసగా నలుగురు ఆడసంతానం, కామాలాగా మళ్లీ ఒక కొడుకు, తర్వాత యిద్దరు ఆడ. ఈ యిద్దరిలో పెద్దది మీ అత్తయ్య, అంటే నా వైపు. పేరు తెలుసుగా స్వరాజ్యం. ఆ రోజుల్లో ఇంటికో స్వరాజ్యం వుండేది.

జయమ్మగారు సొంతమనిషి కంటె ఎక్కువగా వుండేది. పురుళ్లూ పుణ్యాలు మాత్రమే కాదు, క్లయింట్స్‌తో కూడా బాగా వ్యవహరించేది. ఆ యా ప్రాంతాలు వేటికి ప్రసిద్ధో తెలుసుకుని ఆయా క్లయింట్స్‌ని పీక్కుతినేది. కూరగాయల దగ్గర్నించి ఆవు నెయ్యిదాకా పోగేసేది. గుమాస్తా సీతారామయ్య అప్పుడప్పుడు ఆవిడతో ఆ చేత యీ చేత వేలిముద్రలు వేయిస్తుండేవాడు. కొన్నిసార్లు బోనెక్కి సాక్ష్యాలు కూడా చెప్పిందనీ, క్లయింటు కేసు గెలిచాక ఆమెను నూతన వస్త్రాలతో సత్కరించారని చెబుతుండేది. ఏమిటో అవో రోజులు. జడ్జీగారింట్లో ఒకసారి అబ్దికం వస్తే ప్లీడర్‌గారిని భోక్తగా పిలిచారు. ఆయనకు హైకోర్టు పని తగిలి సీతారామయ్యని పంపుతానన్నారు. జడ్జీగారు అగ్గిమీద గుగ్గిలమై, ఎంత బెడ్డాప్లీడర్ గుమస్తా కాళ్లు కడుగుతానా అని నోరు చేసుకున్నారట. తర్వాత మామగారే స్వయంగా హాజరై వచ్చారు. ఆ పైన నెలతిరక్కుండా మూడు కేసులు పరిష్కారమైనాయి.

జయమ్మగారు హడావిడిచేసి ఇంటిల్లిపాదినీ లేపింది. నాకు మరోగంటకు నిజరూపం వచ్చింది. పొద్దున పూట ప్లీడర్‌గారిళ్లు పార్టీలతో కిటకిటలాడుతుంటాయి. గడియారం గంటలు లెక్కపెడుతున్నాను. ఈ లెఖ్ఖన ఎప్పటికి పొద్దుగూకేను. మీ స్వరాజ్యం అత్తయ్య పండిన గోరింటాకు చేతులతో గజ్జెల గుర్రంలా యిల్లంతా తిరుగుతుంటే, నా గుండెల్లో బొంగరం తిరుగుతున్నట్టుంది. గుమస్తా సీతారామయ్య టైపుమిషన్‌లో ఒక్కొక్క అక్షరమే వెదికి కొడుతున్నాడు. వున్నట్టుండి ముక్కులెగరేశాడు. ఆంజనేయస్వామి పటానికి వున్న సింహాచలం సంపెంగదండ చూశాడు. పని ఆపి వెళ్లి పటానికి దణ్ణం పెట్టి, లెంపలు వేసుకున్నాడు. అప్పటికే సంపెంగ రెక్కలు కొన్ని రాలి నేలమీద పడ్డాయి. "మీరు తెచ్చినట్టున్నారు. ఆహా! ఏమి పరిమళం" అని ఆయన తన్మయుడు అవుతుంటే నేను నోరుమూసుకు పూరుకోవచ్చు కదా. లేదు. "నాకేం తెలియదండీ." అన్నాను.

మధ్యాన్నానికి దృశ్యం మారిపోయింది. మాటకి శక్తిలేదని ఎవడనగలడు. ఫలానా ప్లీడర్‌గారింట్లో ఆంజనేయస్వామికి సంపెంగలు పూస్తున్నాయనే మాట వూరు మీద పడింది. జయమ్మగారు మరీ తక్కువగా వుంటే బావుండదని పది తులశి దళాలు తెచ్చి సంపెంగ రెక్కలతో బాటు పడేసింది. మరో గంటకి పొరుగూరి జట్కాలు రావడం మొదలైంది. కేసులు వాయిదాలు పడ్డాయి. స్కూళ్ళకి మధ్యాన్నంనించి సెలవు ప్రకటించారు. రెండు భజన సంఘాలవాళ్లు తమతమ సాధన సామాగ్రితో రంగ ప్రవేశం చేశారు. ఎవరి ప్రమేయం లేకుండా వారి మానాన వాళ్లు భజనలు సాగిస్తున్నారు. పానకాలు వడపప్పు సిద్ధమైంది. ఇద్దరు ముగ్గురికి పూనకాలు వచ్చాయి. సింధూరం వర్షిస్తోంది. మీ అత్తయ్య భక్తుల సేవలో మునిగిపోయింది. పొద్దువాటారుతున్న కొద్దీ భక్త జన ప్రభంజనం తీవ్రమైంది. నా గుండెల్లో రాయిపడింది. మామగారిల్లు దేవాలయంలా మారిపోయింది. మర్రివిత్తనమంత మాట మహావృక్షమైంది. ఇంక నేనాదశలో మాట తిప్పుకోలేను. తిప్పుకున్నా ఏమీ ఫలితం వుండదని అర్ధమైంది. ఇంటి బయట టెంకాయలు, కర్పూరం అమ్మే బల్లలు వెలిశాయి. స్వామివారి ఫోటోలు తత్సంబంధమైన సాహిత్యం అమ్మకానికి దిగింది. సంపెంగలు పూయడం నుంచి ముత్యాలు రాలుతున్నాయనే దాకా వెళ్లింది- ఆనోటా యీనోటా పడి. క్షణాల మీద దైవ మహత్యం చిలవలుపలవలుగా అల్లుకుపోయింది. నా మానసిక క్షోభ నాకు తెలుసు, పైనున్న హనుమంతుడికి తెలుసు. నా సామ్రాజ్యం నాకు అందకపోగా, అప్పాలు చిట్టిగారెలు చెయ్యడానికి మడికట్టుకుంది. నేను పోనీ నిజం చెప్పి కుండబద్దలు కొడదామంటే, అప్పటికే పరిస్థితి చేజారిపోయింది. చివరకి యిదంతా నిజమేనని నేను కూడా నమ్మే పరిస్థితి ఏర్పడింది. అందుకని గట్టిగా ఒట్టేసుకున్నాను.

ఇంతలో బయట్నించి తలుపుతట్టిన చప్పుడు, అత్తయ్య కేకలు వినిపించాయి. తలుపు తీశాం. ఎదురుగా అత్తయ్య నిలబడి

"అవాకులు చెవాకులు ఏమీ పేలలేదు కదా" అంది.

"ఏంలేదు. అంతా కళ్లకు కట్టినట్టు చెప్పాడంతే" అన్నాం మేము.

"అంచేత ప్లీడర్‌గారి పిల్లల్ని చేసుకోవడం లాభదాయకం. మా పిల్లలు యిద్దరూ అంజని, పవన్‌కుమార్ సముద్రాలు లంఘించి, హాయిగా అమెరికాలో వుంటున్నారు..." అని మావయ్య అత్తయ్య సముఖంలో కథ ముగించాడు.

"పవమానసుతుడు బట్టు పాదారవిందములకు.." అని ఎంతో తన్మయత్వంతో మా సామ్రాజ్యం అత్తయ్య మంగళహారతి పాడింది.

